క్లుప్తంగా

రీసర్వేతో భూములకు కచ్చితమైన సరిహద్దులు

నిడదవోలు రూరల్: ప్రభుత్వం చేపట్టిన రీసర్వేతో భూములకు కచ్చితమైన సరిహద్దులను నిర్ధారిస్తామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. మండలంలోని మునిపల్లిలో రీ సర్వే ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు నాయక్ మాట్లాడుతూ, రైతులు తమ భూముల రికార్డులను సకాలంలో సమర్పించాలన్నారు. గ్రామంలో ఇప్పటికే 70 శాతం సర్వే పూర్తి చేశామని చెప్పారు. సరిహద్దుల్లో ఏమైనా తేడాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వో ప్రభాకరరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువ పనులు పూర్తి చేయాలి


పట్టణంలో మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: పట్టణంలో మురుగునీటి కాలువలను బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. పట్టణంలో పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో 11వ వార్డు ఉజ్జినవారి వీధిలో పర్యటించిన మంత్రి దుర్గేష్ మురుగునీటి కాలువను పనులను పరిశీలించారు. వార్డు ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేజర్ డ్రెయిన్లలో మురుగునీటి పారుదల లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మురుగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, మున్సిపల్ ఏఈ హేమంత్ పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంగా రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రాంగణాన్ని నిర్ణయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తాను చేసిన విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించి తగు నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సీటీఆర్ఐ: కళా రాజధాని నగరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాధించగలిగానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. దీనికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలియజేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి

కడియం: ప్రతి ఇంటికీ రేషన్ పంపిణీని కొనసాగించాలని కడియం మండల ఎండీయూ ఆపరేటర్లు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం తమకు ఉపాధి కల్పిస్తూ ఆరేళ్లు పనిచేసే విధంగా నియమించిందన్నారు. అప్పటి వరకూ కొనసాగిస్తే ప్రత్యామ్నాయాలు చూసుకుంటామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చెల్లుబోయిన దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు యనమదల మణికంఠ, సభ్యులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రకాశంనగర్: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థను కొనసాగిస్తూ, ఇంటి వద్ద రేషన్ సరకులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ముందస్తు సాగుకు సన్నద్ధం

- నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- ఆకుమడులు, దమ్ము పనులు ప్రారంభం


అజ్జరంలో ఖరీఫ్ సాగుకి దుక్కి దున్నిన చేను


ఉసులుమర్రులో ఆకుమడి కోసం దమ్ము చేస్తున్న రైతు

పెరవలి: ఖరీఫ్ సాగు ముందస్తుగా వేయాలనే ఉద్దేశ్యంతో అధికారులు జూన్‌లోనే కాలువలకు సాగునీరు వదలటానికి సిద్ధం కావడంతో రైతులు అందుకు అనుగుణంగా సన్నద్ధమవుతున్నారు. ప్రధాన కాలువలకు నీరు వచ్చినా మధ్యస్థ, చిన్న కాలువలకు నీరు రావటానికి మరో 3 రోజుల సమయం పడుతుందనే ఉద్దేశ్యంతో రైతులు చేలను దుక్కిదున్ని సాగుకి సన్నద్ధమవుతున్నారు. మరో వైపు వర్షాలు కురవడంతో వరి పంట సాగు చేసే రైతులు బోర్ల నీటి ద్వారా ఆకుమడులు వేయటానికి చేలను దమ్ము చేస్తున్నారు. కాలువల ద్వారా సాగునీరు వచ్చిన వెంటనే సాగు పనులు ముమ్మరం చేయడానికి దమ్ములు చేపడుతున్నారు. ఆకుమడలు వేయటానికి రైతులు విత్తనాలను నానబెట్టి సిద్ధంగా ఉన్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం

నిడదవోలు నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు 36,500 ఎకరాలు సాగు చేయటానికి రైతులు సిద్ధంగా ఉండగా ఇందులో నిడదవోలులో 16,500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 11,500, పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు.

ముందస్తు సాగుతో రైతులకు మేలు

ముందస్తు సాగు వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు పాడైపోతున్నాయని జూన్‌లో ఆకుమడులు వేసి జూలైలో వరినాట్లు పూర్తయితే అక్టోబర్‌లోనే పంటలు కోతకు వచ్చి రైతులకు ఎటువంటి వైపరీత్యాలబారిన పడకుండా పంటను రక్షించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్‌లో సాగు చేసేవివరాలు

ఖరీఫ్ సాగులో ఎక్కువగా స్వర్ణ, పీఎల్ రకాలతో పాటు పీఎల్‌పీ 1100, యంటీయూ 1064, యంటీయూ 1061, యంటీయూ 1229 రకాలు మరి కొంత మంది రైతులు సన్న రకాలు సాగు చేయటానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెరవలి మండలంలో ఉసులుమర్రు, తీపర్రు, కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారంలో వరి విత్తనాల కోసం సాగు ముందుగా చేపట్టారు. రైతులు ముందుకు వచ్చి సాగు చేపడితే లాభాలతో పాటు పంట దక్కుతుందని అధికారుల సూచిస్తున్నారు.

వరి విత్తనాలు సిద్ధం

ఏటా ఆలస్యంగా నాట్లు వేయటం వలన పంటలు ప్రకృతి వైపరీత్యాల బారినపడి పాడవుతున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. నష్టాల నుంచి బయట పడేందుకు రైతులను ముందస్తు సాగుకు సన్నద్ధం చేస్తున్నాం. పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో వరి సాగు చేయటానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. వరి విత్తనాలు సొసైటీలతో పాటు డీసీఎంఎస్‌లో సిద్ధంగా ఉన్నాయి.

– మేరీ కిరణ్, మండల వ్యవసాయాధికారి, పెరవలి

రేషన్ వాహనాలను కొనసాగించాలని విజ్ఞప్తి


దేవరపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

దేవరపల్లి: ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించి ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ బుధవారం దేవరపల్లి మండలంలోని పలువురు వాహనదారులు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో 17 మంది డోర్ డెలివరీ ఆపరేటర్లుగా ఐదేళ్లుగా పనిచేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం మరొక 18 నెలలు కాలపరిమితి ఉన్నందున ఆపరేటర్లుగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆపరేటర్లు కోరారు. జూన్ ఒకటి నుంచి ఎండీయూ వాహనాలను నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉపాధి కోల్పోతామని కుటుంబంతో రోడ్డున పడతామని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరాస్వామి, పలువురు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ


తాళ్లపూడిలో తిరంగా ర్యాలీ

తాళ్లపూడి: ఉగ్రవాదంపై పోరులో భాగంగా పాకిస్తాన్‌పై భారత్ చేసిన దాడులతో ప్రపంచానికి మన దేశ త్రివిధ దళాల బలం తెలిసిందని బీజేపీ నాయకులు పిల్ల మర్రి మురళీకృష్ణ అన్నారు. తాళ్లపూడిలో బుధవారం ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా తిరంగా యాత్ర నిర్వహించారు. మండల బీజేపీ, ఎన్డీఏ కూటమి నాయకులు, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బజార్ సెంటర్‌లో వెయ్యి మీటర్ల జాతీయ పతాకంతో ప్రజలు, నాయకులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బీజేపీ నాయకులతోపాటు ముస్లిం సోదరులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం కాలేదు

తాళ్లపూడి: స్కూల్ కాంప్లెక్స్ నిధులు దుర్వినియోగం కాలేదని, తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉండే స్కూలు కాంప్లెక్స్ కొత్తగా వేగేశ్వరపురానికి అధికారులు మార్చారని ఎంఈవో, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ బాలామణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నిధులు వినియోగం విషయంలో తాళ్లపూడికి కేటాయించాలా లేదా అన్న విషయంపై స్పష్టత లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేచి చూస్తున్నామని, దీంతో నిధుల వినియోగం ఆలస్యమైందని తెలిపారు. ఇప్పటికే కొన్ని వస్తు సామగ్రి కాంప్లెక్స్ కమిటీ నిర్ణయం మేరకు కొనుగోలు చేశామని, నిధుల దుర్వినియోగానికి అవకాశం లేదని అన్నారు. మండలంలో మలకపల్లి, తాళ్లపూడి, అన్నదేవరపేట కాంప్లెక్స్‌లు ఇప్పటి వరకు ఉండగా ఇటీవల తాళ్లపూడి స్కూల్ కాంప్లెక్స్ వేగేశ్వరపురం కాంప్లెక్స్‌గా మారిందని ఎంఈవో బాలామణి తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5న విజయవాడలో నిర్వహించనున్నట్టు గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లూరి శాంతిప్రియ (డిప్యూటీ తహసీల్దార్) పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులంతా తప్పక హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, ఎస్.ప్రసాద్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో వైఎస్సార్ సీపీ నేతలు


సుశ్రిత, యశ్వంత్ శ్రీరెడ్డి వివాహ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు

దేవరపల్లి: గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, లక్ష్మి దంపతులు కుమార్తె సుశ్రిత, యశ్వం శ్రీరెడ్డి వివాహ వేడుక బుధవారం స్థానిక కేఎస్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ హోం మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వల్లభనేని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ అన్వర్ బాషా, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు సాలి వేణు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు


మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న సుభద్రపాలెం గ్రామస్తులు

నల్లజర్ల: మండలంలోని సుభద్రపాలెంలో సీతమ్మ ఆవ చెరువు నుంచి మట్టి అక్రమ రవాణాను గ్రామస్తులు బుధవారం ఉదయం అడ్డుకున్నారు. ఏటా వేసవిలో చెరువు పూడికతీసి ఆ మట్టిని రైతులు తమ పొలాల్లో వేసుకునే వారు. క్యూబిక్ మీటరు వంతున ఇరిగేషన్ అధికారులకు సొమ్ము చెల్లించి అన్ని అనుమతులతో మట్టిని తరలించేవారు. ఈ ఏడాది కూటమి నాయకులు ప్రభుత్వం అండదండలతో ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే జేసీబీలు, టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. మట్టి తరలింపు కేవలం ట్రాక్టర్లతోనే పొలాల్లోకి తీసుకెళ్లాల్సి ఉండగా నాయకులు ఏకంగా టిప్పర్లను వినియోగిస్తూ తరలిస్తున్నారు. ఈ మట్టిని ఇటుక బట్టీలకు, నివాస ప్రాంతాల ఎత్తు పెంచడానికి వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆవ చెరువులో ఉన్న రెండు జేసీబీలు, 3 ట్రాక్టర్లు, 1 టిప్పర్, 2 ట్రాలీలను అడ్డుకొని అధికారులకు అప్పగించారు. మట్టి తరలింపును అడ్డుకున్న వారిలో కైలా సంపత్ రావు, సకలాబత్తుల శ్యామ్, బుగ్గల దుర్గాప్రసాద్ ఉన్నారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది ఆవ చెరువు వద్దకు వచ్చి అక్రమ తరలింపును నిలుపుదల చేశారు.

హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభం


పెరవలిలో విశేష అలంకరణలో అభయాంజనేయస్వామి

పెరవలి: జాతీయ రహదారి పక్కన పెరవలిలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి ఆలయ 34వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 24 వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. హనుమజ్జయంతి, వార్షికోత్సవాల సందర్భంగా పెరవలి అభయాంజ నేయస్వామి, ఖండవల్లిలో వేంచేసియున్న భక్తాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కానూరు అగ్రహారం, పెరవలి, తీపర్రు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు చేశారు.

5న ప్రభుత్వ ఉద్యోగులు 'చలో విజయవాడ'

- ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- తూ.గో.జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్మ


తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5న విజయవాడలో పదివేల మందితో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గిరిప్రసాద్ వర్మ పేర్కొన్నారు. ఉద్యోగులంతా పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నల్లజర్లలో గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీఆర్వోలు తమకు పనిభారం తగ్గించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల విడుదల చేసిన జీవోతో వీఆర్వోలపై పని భారం పెరగడం, మిగిలిన వీఆర్వోలను నిర్దిష్టమైన విధి విధానాలతో జీఓ జారీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019కు పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో రెవెన్యూ అధికారులను మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వోల సంఘ అధ్యక్షుడు జే.శామ్యూల్, డివిజన్ జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మణమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం నిర్వహణ భేష్

- నందిగంపాడు ప్రథమ స్థానం


చాగల్లులో పంచాయతీ కార్యదర్శి శిరీష రాణిని సత్కరిస్తున్న ఎంపీడీవో, అధికారులు

చాగల్లు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సక్రమ నిర్వహణపై, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా ప్రతిస్పందన సర్వేలో చాగల్లు మండలంలోని నందిగంపాడు గ్రామం తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో ఆర్ శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని చాగల్లు, దారవరం, నెలటూరు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల మల్లవరం గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల పనితీరుపై చేసిన సర్వేలో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. కొవ్వూరు డివిజన్‌లో చాగల్లు మండలానికి రెండవ స్థానం లభించిందన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన నందిగంపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.శిరీష రాణిని దుశ్శాలువా, పూలమాలలతో ఎంపీడీవో శ్రీదేవి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్.శ్రావణ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఎండీ అలీ, రాకేష్, కాశీమ్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదం


కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద యోగాపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు


పెరవలిలో యోగాపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

నిడదవోలు : మానసిక ప్రశాంత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఈనెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్న వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని స్థానిక రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాలులో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. యోగా గురువు సానేపు సుబ్బారావు పలు యోగాసనాలు వేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, కూటమి నాయకులు రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శారీరక శ్రమతో ఆరోగ్యం

తాళ్లపూడి(కొవ్వూరు): శారీరక శ్రమ, ఉత్తమ జీవన విధానం, యోగా సాధన ద్వారా మన పూర్వీకులు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద బుధవారం యోగా ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. విద్యార్థులు పలు ఆసనాలు వేసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఆర్టీసీ డిపో మేనేజర్ వీవీ కుమార్, ఆర్టీసీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

తాళ్లపూడి: యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తాళ్లపూడి ఎంపీడీవో వెంకటరమణ పేర్కొన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యోగా ఆంధ్రాలో భాగంగా యోగ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి హరికా గుప్త మాట్లాడుతూ యోగా తప్పనిసరిగా ఆచరించాల్సిన ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, ఎంఈవో సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, మండలంలోని పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు రామచల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

పెరవలి: యోగాతో మానసిక ఒత్తిడి తట్టుకునే వెసులుబాటు ఉంటుందని దీనిని ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా రోజు చేయాలని తహసీల్దార్ డి.అత్యుత కుమారి తెలిపారు. పెరవలి మండల పరిషత్ కార్యాలయం నుంచి బుధవారం ఉదయం ర్యాలీ నిర్వహించి యోగా చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయటం వలన పని ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. యోగా సాధనతో మానసిక ప్రశాంతత, ఒత్తిడి తగ్గుతుందని దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన

చాగల్లు: యోగాసనాలు, శ్వాస వ్యాయామాలు, ధ్యాన విధానాల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చనని ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. యోగాను ప్రతిరోజూ ఆచరించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యం.మెరికమ్మ, ఈవోపీఆర్డీ ఆర్ శ్రవణ్‌కుమార్, యం.ఈ.ఓ గురునాథం, సుభాకర్, హౌసింగ్ ఏ.ఈ సుబ్బరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, యోగ అభ్యాసకులు పాల్గొన్నారు.